



తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహించిన వరంగల్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, చిత్రంలో జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయభాస్కర్

భూ కలకలం




సెప్టెంబర్ నెలలో మేడారం అడవుల్లో టోర్నడోతో నేలమట్టమైన వృక్షాలు(ఫైల్)

### నేను కూడా బయటికి వచ్చాను

మేడారం కేంద్రంగా 40 కిలో మీటర్ల భూమి లోపల ప్రకంపనలు సంభవించి భూకంపం వచ్చిందని ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర తెలిపారు. ఉదయం 7:27 గంటలకు రెండు సెకన్ల పాటు భూమి కంపించిందని రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదైనట్లు పేర్కొన్నారు. భూకంపం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం పెద్దగా జరగలేదని తెలిపారు. ప్రజలకు రక్షణ చర్యలు కల్పించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో చిన్న చిన్న ఇండ్ల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. భూకంపంతో తాను సైతం ఆందోళనకు గురై ఇంటి నుంచి బయకు వచ్చానని.. జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని చెప్పారు.

- ములుగు కలెక్టర్ దివాకర

# మేడారం అడవుల నుంచే
# మళ్లీ అలజడి

**నాడు టోర్నడో..**
**ఇప్పుడు భూకంపం కేంద్రం**

- మూణ్నెళ్ల క్రితం పెనుగాలి బీభత్సానికి విరిగిపడ్డ చెట్లు
- ప్రకంపనలతో ఉలిక్కిపడ్డ ఉమ్మడి జిల్లా
- గోడలకు బీటలు.. చెల్లాచెదురైన వస్తువులు
- భయంతో బయటకు పరుగులు
- రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు



మొన్న టోర్నడో బీభత్సంతో నేలమట్టమైన మేడారం అటవీ ప్రాంతం.. ఇప్పుడు భూకంపానికీ కేంద్రమై మళ్లీ అలజడి రేపింది. నాటి పెను విధ్వంసానికి వందల ఎకరాల్లో చెట్లు కూలిపోయి ఇంకా కుదురుకోకమేందే.. బుధవారం మరోసారి భూకంపం రూపంలో ప్రకంపనలు సృష్టించడంతో ఉమ్మడి జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఉదయం 7.28గంటలకు 5 సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలంతా భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురై, గోడలకు పగుళ్లు తేలడంతో ఏం జరుగుతున్నదో తెలియక బెంబేలెత్తిపోయారు. ముఖ్యంగా ములుగు, భూపాలపల్లిలో తీవ్రత ఎక్కువగా కనిపించగా మిగతా చోట్లా ప్రభావం కనిపించింది. అయితే పగబట్టినట్టు ప్రకృతి మరోసారి విరుచుకుపడడం ఎలాంటి హెచ్చరికలకు సంకేతమని సర్వత్రా చర్చ జరుగుతోంది. కాగా పలుచోట్ల రికార్డయిన సీసీటీవీ ఫుటేజీలతో పాటు ఉదయం నుంచి తమకు ఎదురైన అనుభవాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

- ములుగు, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)/నమస్తే నెట్‌వర్క్


'భూకంపం వచ్చిందట కదా! మీకు ఏమైనా తెలిసిందా?' మా ఇంట్లో గిన్నెలు కిందపడ్డాయి.. ఊయల ఊగినట్టు అనిపించింది? నేనైతే ఒక్కసారిగా కింద పడబోయిన. బీపీ తక్కువై అట్ల అయిందేమో అనుకున్నా. మా గోడకు పగుళ్లు వచ్చాయి? ఇలా బుధవారం ఉదయం 7 తర్వాత అన్నిచోట్ల ఇదే ముచ్చట. తాడ్వాయి మండలం మేడారం అటవీ ప్రాంతం భూకంపానికి కేంద్రం కావడం రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. మూడు నెలల క్రితం సుమారు 500 ఎకరాలకు పైగా భారీ వృక్షాలు ఒకే వైపునకు నేలమట్టమైన సంఘటన మరువక ముందే ఇదే ప్రాంతం నుంచి భూకంపం చోటుచేసుకోవడం పర్యావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా అని తెలుస్తున్నది. బుధవారం ఉదయం 7.27 గంటలకు సంభవించిన భూ ప్రకంపనలతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇండ్లలోని వస్తువులు కిందపడడంతో పాటు ఇండ్లు ఊయలలో ఊగినట్లు 5 సెకన్ల పాటు కదలడంతో ప్రజలు బయటకు పరుగులు తీసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భూకంపం కారణంగానే వచ్చాయని వాతావరణ శాఖ అధికారులు నిర్ధారించారు.



**1969లో ఇదే తరహాలో భూకంపం**

1969లోనూ ములుగు ప్రాంతం కేంద్రంగా భూకంపం సంభవించిందని ప్రజలు చర్చించుకున్నారు. అప్పుడు ఎండాకాలంలో రాత్రి 8గంటలకు ఒక్కసారిగా భూకంపం రావడంతో ప్రజలు ఇండ్లను వదిలి బయటకు పరుగులు తీశారని, రాత్రంతా జాగారం చేశామని గుర్తుచేసుకున్నారు. మరికొందరు వాకిళ్లలో నిద్రించారని పేర్కొన్నారు. మళ్లీ 55 ఏండ్ల తర్వాత బుధవారం భూకంపం వచ్చింది. ఈ ప్రకంపనలతో జిల్లాలోని తొమ్మిది మండలాల ప్రజలు బెంబేలెత్తిపోయారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన భూకంప దృశ్యాలను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భూకంప సంఘటన తీవ్ర దుమారం రేపింది. మేడారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో సైతం భూకంపం కారణంగా గద్దెల ప్రాంగణం కదిలిన దృశ్యాలున్న వీడియోలు సాక్ష్యంగా నిలిచాయి.


## రామప్ప సేఫేనా?



**ఆలయాన్ని పరిశీలించిన కేంద్ర పురావస్తు అధికారులు**

రామప్పగుడి కప్పును పరిశీలిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ అధికారులు

వెంకటాపూర్, డిసెంబర్ 4 : భూకంపం విషయం తెలుసుకున్న కేంద్రం పురావస్తు శాఖ అధికారులు వెంటనే అప్రమత్తమై పాలంపేటలోని రామప్ప ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ఏమైనా పగుళ్లు ఏర్పడ్డాయా?, కప్పు భాగంలో చీలికలు వచ్చాయా? అని కేంద్ర పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హెచ్.ఆర్.దేశాయ్, ఏఈ కె.కృష్ణ చైతన్య, సీఏ నవీన్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు అర్చకులు, సిబ్బందిని కలిసి ఏమైనా తేడాలు గమనించారా అడిగి తెలుసుకున్నారా? గతంలో ఏర్పడిన పగుళ్లు అదే విధంగా ఉన్నాయా, ఎక్కువ అయ్యాయా అని తరచి చూశారు. బుధవారం సంభవించిన భూకంపం వల్ల దేవాలయానికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని అధికారులు స్పష్టంచేశారు.



ఏటూరునాగారం : శంకరాజుపల్లిలో కూలిన ఇంటి గోడ

### కండ్లు తిరిగినట్లు అనిపించింది



మహబూబాబాద్ రూరల్ : ఉదయం పూట కిరాణా షాప్ తీసి కౌంటర్లో కుర్చున్నా. కస్టమర్లు చక్కెర, టీ పొడి కావాలని వచ్చిండ్రు. బస్తాలో ఉన్న షుగర్ తీసి కాంటాలో పెట్టినప్పుడు ఒక్కసారిగా కాంటా అటు ఇటుగా కదిలింది. పైన ఉన్న రేకులు కదిలినట్లు సౌండ్ వచ్చింది. కిరాణా షాప్‌లో పెట్టిన సామాన్లు మొత్తం కదిలాయి. నాకు ఒక్కసారే కండ్లు తిరిగినట్లు అనిపించింది. షాప్ పక్కన ఉన్న వారు రోడ్డుపైకి ఉరికారు. వెంటనే షాప్‌లోంచి బయటకు వచ్చిన. అర్ధగంట వరకు చాలా భయం అయింది. ఇండ్లలో ఉన్న జనాలందరు రోడ్లపైకి వచ్చారు.


– షేక్ వహీదా, బేతోలు



గోవిందరావుపేట : ఇంట్లో కింద పడిన సామగ్రి

**రుణమాఫీ పూర్తయ్యిందన్న ప్రకటనపై ఆగ్రహం**

- బూటకపు మాటలతో మాయ చేసిండని ఆక్రోషం
- కొర్రీలు పెట్టి సగం మందిని దూరం చేశాడని ఆరోపణ
- మిత్తికి డబ్బులు తెచ్చి బ్యాంకుల కట్టినమంటూ ఆవేదన
- సెల్ఫీలు, పత్రాలు తీసుకొని వంచించాడని ఫైర్




# నమ్మించి.. నట్టేట ముంచిండు

రుణమాఫీ పూర్తయ్యిందన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనపై రైతులు మండిపడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల లోపు రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తామని నమ్మించి.. చివరికి నట్టేట ముంచాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విడతల వారీగా వర్తింపజేస్తామని చెప్పి.. లేని పోని కొర్రీలు పెట్టి సగం మందిని మాఫీకి దూరం చేశాడని ఆవేదన చెందుతున్నారు. మొదటి విడత జాబితా విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నా.. ముఖ్యమంత్రికి కనికరం లేకుండా పోయిందంటున్నారు. అన్ని అర్హతలుండీ మాఫీ కాలేదని ఆందోళనలు చేస్తే.. సెల్ఫీలు, గుర్తింపు ధ్రువపత్రాలు తీసుకొని వంచించాడని ఫైర్ అవుతున్నారు. రూ. 2 లక్షలకు పైనున్న డబ్బులు చెల్లిస్తే మాఫీ అవుతుందన్న బూటకపు మాటలకు ఆశపడి అధిక మిత్తికి అప్పులు తెచ్చి బ్యాంకుల చెల్లించి గోసపడుతున్నామని చెపుతున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

### రేవంత్‌రెడ్డీ.. నాకు రుణమాఫీ కాలే..



పాలకుర్తి : నేను గతంలో వర్ధన్నపేట డీసీసీ బ్యాంక్‌లో రూ. 70 వేల అప్పు తీసుకున్న. నా భార్య కమలమ్మ పాలకుర్తిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ. 70 వేలు తీసుకున్నది. ఇద్దరికి మిత్తితో కలిపి రూ. 90 వేల చొప్పున రూ. 1.80 లక్షల అప్పు ఉంది. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మా ఇద్దరిలో ఏవరికీ కాలేదు. మరి రుణమాఫీ 100 శాతం పూర్తయిందని ఎట్లా అంటున్నవు రేవంత్‌రెడ్డి. నేను, నా భార్య బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ మొదటి విడత నుంచి తిరుగుతున్నం. వారు పొంతన లేని సమాధానాలు చెపుతున్నరు. మీ సొంత పార్టీ కార్యకర్తలు, నాయకులకు కూడా మాఫీ కాలేదని మొత్తుకుంటున్నరు. రేవంత్‌రెడ్డి.. రుణమాఫీ చేసి రైతుల పుణ్యం పంచుకో.

– గుగులోత్ వాసునాయక్, రైతు, దుబ్బతండా, పాలకుర్తి మండలం

### కాంగ్రెస్ ప్రభుత్వం ముప్ప తిప్పలు పెడుతాంది



మహదేవపూర్ : నాకు మహదేవపూర్ శివారులో 5 ఎకరాల భూమి ఉంది. నేను స్థానిక పీఏసీఎస్ నుంచి రూ. 2.50 లక్షల పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం ప్రకటించినట్లుగా నాకు రూ. 2 లక్షల వరకు మాఫీ అవుతుందని అనుకున్న. లిస్ట్‌లో నా పేరు రాకపోవడంతో బ్యాంక్ అధికారులను అడిగితే వారు పొంతన లేని సమాధానాలు చెబుతున్నరు. వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదు. గత కేసీఆర్ సర్కారులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు, కొర్రీలు లేకుండా రుణమాఫీ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక మమ్ముల్ని ముప్పు తిప్పలు పెడుతాంది. చాలా మందికి మాఫీ కాక బ్యాంక్‌లు, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నరు. ప్రభుత్వం షరతులు లేకుండా రైతులందరి రుణాలు మాఫీ చేయాలి.

– అడప లక్ష్మీ నారాయణ, రైతు, మహదేవపూర్

### పదివేలు కట్టినా మాఫీ లేదు.. మన్నూ లేదు



రాయపర్తి : ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తమంటే రైతులంతా సంబురపడి అధికారం అప్పజెప్పిండ్లు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రోజుకో మాట, పూటకో ముచ్చట చెప్పుకుంట కాలం గడుపుతాండు. నాకు రాయపర్తిలోని ఎస్బీఐలో రూ.1,20,250, నా భార్య రమనీతకు వర్ధన్నపేట డీసీసీబీలో రూ. 80,613 అప్పు ఉంది. ఇద్దరికి కలిపి రూ. 2,00, 863 ఉండటంతో మాఫీ కాలేదని అప్పుడు ఆఫీసర్లు చెప్పిండ్రు. మా కుటుంబ సభ్యుల ఒత్తిడితో ఎందుకైనా మంచిదని రూ. 10 వేలు క్రాప్ అకౌంట్‌ల కట్టి మూడు నెలలు దాటినా మాఫీ లేదు.. మన్నూ లేదు.. ఏం లాభం లేదు.

– కే సాంబరాజు, యువ రైతు, రాయపర్తి

### మిత్తికి తెచ్చి డబ్బులు కట్టిన..



నర్సింహులపేట : నేను బ్యాంకులో రూ. 2.70 లక్షల లోను తీసుకున్న. రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రైతులు పై డబ్బులు బ్యాంకులో కడితే వెంటనే రుణమాఫీ చేస్తామంటే ఆగస్టు నెలలో రూ. 3 మిత్తికి అప్పు తీసుకొచ్చి రూ.70 వేలు కట్టిన. అయినా నాకు రుణమాఫీ కాలేదు. ఇది ఏంది సారు అని ఏవోను అడిగితే మాకేం తెల్వదు, ప్రభుత్వం నుంచి లిస్టు వస్తనే తెలుస్తదని చెబుతున్నడు. అసలు మాకు రుణమాఫీ అయితదా? కాదా? జర చెప్పండి.

– గుగులోత్ నెహ్రూ, రైతు, పత్నితండా, నర్సింహులపేట

### నమ్మితే నట్టేట ముంచింది..



హసన్‌పర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తానంటే నమ్మినం. కానీ నట్టేట ముంచింది. బ్యాంక్, వ్యవసాయ అధికారులకు అన్ని పత్రాలు ఇచ్చినం. రేపుమాపు అని తిప్పుతున్నరు. రుణమాఫీ చేసినమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్తాండు కాని బ్యాంక్‌లో అడిగితే వాళ్లు కాలేదంటున్నరు. ఎవల్ని నమ్మాలో తెల్తలేదు. అడ్తిదారు వద్ద అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినం. ఈ సర్కారు మాటలల్లనే కాని చేతలల్ల లేదు.

– బొజ్జ అశోక్, రైతు, జయగిరి, హసన్‌పర్తి

### లిస్టులో పేరు లేదు



ఆత్మకూరు: రుణమాఫీ లిస్టులో నా పేరు లేదు. గతంలో చాలా సార్లు వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి అధికారులను అడిగితే ప్రాసెసింగ్‌లో ఉందన్నరు. ఇంకో విడుతలో రుణమాఫీ అవుతుందని చెప్పిండ్రు. కెనరా బ్యాంక్‌లో రూ. 2 లక్షల లోన్ తీసుకున్న. అప్పటి నుంచి ఇప్పటి వరకు వడ్డీ కట్టిన. బ్యాంకోళ్ల వద్దకు వెళ్లి అడిగితే లిస్టు రాలేదంటున్నరు. అధికారులు పొంతన లేకుండా సమాధానం చెబుతున్నరు. ప్రభుత్వం రుణమాఫీ అయిందని ప్రకటనలు చేస్తున్నది. అసలు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు.

– రంపీసా మనోహర్, రైతు, తిరుమలగిరి, ఆత్మకూరు

### రైతులను మోసం చేసింది



నడికూడ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేశానని చెప్తున్నది కానీ అందరికీ కాలేదు. నేను రూ. 1,50,000 పంట రుణం తీసుకోగా అసలు వడ్డీ కలిపి రూ. 1,71,000 అయినయ్. రుణమాఫీ కాకపోగా అదనంగా రూ. లక్ష బ్యాంకోళ్లు కట్టించుకున్నరు. ఇకనైనా ప్రభుత్వం రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకోవాలి.

– చందా కుమారస్వామి, రైతు, వరికోల్

### జంక్షన్‌లో జలధారలేవి?

**నిన్న వెలుగులమయం.. నేడు అంధకారం**

**విజయోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, అధికారులు నిన్న(మంగళ వారం) వరంగల్ బాలాజీ జంక్షన్‌లో ఆర్భాటంగా ప్రారంభించిన ఫౌంటేన్ వెలుగులు ఒక్కరోజుకే పరిమితమయ్యాయి. అయితే మరుసటి రోజు బుధవారం రాత్రి ఇలా విద్యుత్ కాంతులేవీ కనిపించక అంధకారం ఆవరించింది.**

- వరంగల్ ఫొటోగ్రాఫర్, డిసెంబర్ 4



చీకట్లో దర్శనమిస్తున్న ఫౌంటేన్, బాలాజీ నగర్ జంక్షన్